చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మావోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

తాగి నడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతోపాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడుసార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్ మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

తొలి వేతనం రెండు నెలలు ఆలస్యం!

- డీఎస్సీ-24 టీచర్లకు ఆదిలోనే నిరాశ
- అక్టోబర్ 10 నుంచి జీతం ఇస్తామన్న విద్యాశాఖ
- పనిచేయని కాలానికి ఎలా ఇవ్వాలంటున్న 'ట్రెజరీ'

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2024లో ఉద్యోగం సాధించి, కొత్తగా కొలువులో చేరిన టీచర్లకు వేతన కష్టం వచ్చి పడింది. ఉద్యోగంలో చేరి రెండు నెలలైనా కొన్ని జిల్లాల్లో ఇంకా వారికి తొలి వేతనం అందలేదు. టీచర్ల నియామకపు తేదీపై ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో జీతాల చెల్లింపు సందిగ్ధంలో పడింది. డీఎస్సీ-2024లో ఎంపికైన 10 వేలకుపైగా టీచర్లకు అక్టోబర్ 10వ తేదీతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. ఆ తర్వాత వారం రోజులకు జిల్లాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇచ్చారు. దీంతో కొంతమంది టీచర్లు అక్టోబర్ 15న, మరికొందరు అక్టోబర్ 17న పాఠశాలల్లో చేరారు. ఒక తేదీతో రిక్రూట్టై, మరో తేదీన పోస్టింగ్ చేతికందడంతో వేతనాల చెల్లింపునకు సాంకేతిక సమస్యలు వచ్చిపడ్డాయి. కొత్త టీచర్లకు అక్టోబర్ 10 నుంచి వేతనాలిస్తామని విద్యాశాఖ ప్రకటించగా, పనిచేయని కాలానికి వేతనాలు ఎలా ఇవ్వాలంటూ ట్రెజరీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఆర్థికశాఖ నుంచి స్పష్టత కోరారు. జాయినింగ్ తేదీని 10వ తేదీగా పరిగణించి, అదే తేదీ నుంచి వేతనం చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతి కోరారు. ఈ ఫైల్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేషీకి చేరింది. డిప్యూటీ సీఎం అందుబాటులో లేకపోవడం, డిసెంబర్ 3వ తేదీ దాటిపోవడంతో వేతనాల చెల్లింపు పెండింగ్‌లో పడిపోయింది.

నిరాశలో కొత్త టీచర్లు

- కొన్ని జిల్లాల్లో ఎంప్లాయ్ ఐడీ, ప్రాన్ అకౌంట్లు క్రియేట్ కాలేదు. కొంతమందికి ఎంప్లాయ్ ఐడీ క్రియేట్ అయినా ప్రాన్ అకౌంట్లు క్రియేట్ కాలేదు. దీంతో వేతనాలు చెల్లింపునకు ఇబ్బందులొస్తున్నాయి.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన ఒక టీచర్ తొలి వేతనంతో తనకు కోచింగ్ ఇచ్చి, మార్గదర్శిగా నిలిచిన గురువుకు మంచి బహుమతి ఇవ్వాలన్న ఆలోచనతో ఉండగా, ఇంతవరకు తొలి వేతనం అందకపోవడం అతని కోరిక తీరలేదు.
- జనగామ జిల్లాకు చెందిన మరో టీచర్ చాలా ఏండ్లుగా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో కోచింగ్ తీసుకుని డీఎస్సీలో కొలువు సాధించాడు. వేతనం ఇంకా రాకపోవడంతో బస్సు చార్జీలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నట్టు సదరు టీచర్ వాపోయాడు.
- హైదరాబాద్ జిల్లాలో కొందరు ట్రెజరీ అధికారులు కొత్త టీచర్ల వేతనాల ఫైల్ ప్రాసెసింగ్‌కు ఒక్కో టీచర్ నుంచి రూ.రెండు వేల చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలొచ్చాయి.

సంక్రాంతికి సన్నబియ్యం ఇచ్చేనా?

- ప్రభుత్వ స్పందన కరువు
- గడువు దగ్గరపడుతున్నా చర్యలు శూన్యం
- దొడ్డు బియ్యం సేకరణకు ప్రభుత్వం నిర్ణయం
- సన్నబియ్యం పంపిణీపై ప్రజల్లో సందేహాలు
- మరో పథకానికి కాంగ్రెస్ సర్కారు తిలోదకాలు?

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఒక్కో పథకాన్ని అటకెక్కిస్తూ.. ఒక్కో హామీకి తిలోదకాలిస్తూ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కారు మరో స్కీమ్‌కు రాంరాం చెప్పేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తున్నది. సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ప్రకటనలకు అనుగుణంగా పని మాత్రం కావడం లేదని సమాచారం. సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ కనీస చర్యలు కూడా ప్రారంభించలేదని తెలుస్తున్నది. మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీకి మరో నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇప్పటివరకు సన్న బియ్యం అస్సలే సేకరించలేదు. మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పట్లో సన్న బియ్యం పంపిణీ లేనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సన్న బియ్యం లేకపోవడంతోనేనా?

సన్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సన్న ధాన్యానికి బోనస్ ఇస్తున్నందున అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగవుతాయని, వాటి ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని ఆలోచించినట్టు తెలుస్తున్నది. ఇందుకు విరుద్ధంగా పౌరసరఫరాల సంస్థకు సన్నాలు రాకపోవడంపై అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. వాస్తవానికి సన్న బియ్యం పంపిణీకి ఏటా 24లక్షల టన్నుల బియ్యం, 36లక్షల టన్నుల ధాన్యం అవసరం. కానీ ఇప్పటివరకు సివిల్ సప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతున్నది. ఇంత భారీస్థాయిలో సన్న బియ్యాన్ని బయట కొనుగోలు చేసి పంపిణీ చేస్తే సివిల్ సప్లైపై భారీ ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ వాయిదా వేసినట్టు తెలుస్తున్నది.

ఫీజుల కోసం 10న కలెక్టరేట్ల ముట్టడి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 16.57 లక్షల మంది విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల్లో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 10న కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలను ముట్టడిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్లు చెల్లిస్తున్నారని, విద్యార్థులకు రూ.వందల కోట్లు చెల్లించేందుకు మనసు రావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అప్పుగా తెచ్చిన తెచ్చిన రూ.80 వేల కోట్లను ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా విద్యార్థులు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు.

పంచాయతీల విలీనంపై జోక్యానికి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): శంషాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. శంషాబాద్ మండలంలోని 51 పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ జారీచేసిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ మాజీ సర్పంచ్ పద్మావతి ఇతరులు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తీర్పుచెప్పింది. మున్సిపాల్టీలో కలిపితే పన్నుల భారం పెరుగుతుందన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్ మొదలైన గ్రామాల విలీనాన్ని అడ్డుకోవాలన్న పిటిషన్లను కొట్టివేసింది. విలీనాన్ని అడ్డుకోరాదన్న ప్రభుత్వవాదనను ఆమోదించింది.

17న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై ఈ నెల 17న నేషనల్ వాటర్ డవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం జరగనున్నది. ఈ అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్రాల డిమాండ్లను తీర్చడం సాధ్యం కాదని ఈ నెల మొదటివారంలో జరిగిన సమావేశంలో కేంద్ర జల్‌శక్తి శాఖ చేతులెత్తేసింది. ప్రాజెక్టుపై కేంద్రమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేసింది. ఈ నెలలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని, ఇదే చివరిదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలోనే 17న సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులు హాజరుకావాలని కోరింది.

కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్‌పై కృష్ణా ట్రిబ్యునల్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభమైంది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ హాజరయ్యారు. ఏపీ తరపున సాక్షి అనిల్‌కుమార్ గోయల్‌ను విచారించారు.

నికేశ్ నుంచి నిజాలు రాబట్టాలి

- విచారణకు సహకరించలేదు
- ఏడు రోజులు కస్టడీకి ఇవ్వండి
- కోర్టులో ఏసీబీ పిటిషన్ దాఖలు
- ఆస్తుల విలువ 600 కోట్లపైనే ఉండొచ్చని అధికారుల అంచనా

నాంపల్లి, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): నీటిపారుదలశాఖలో ఏఈఈగా పనిచేస్తూ వందల కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న హేరూర్ నికేశ్‌కుమార్ కేసులో నిజాలు నిగ్గుతేల్చాల్సి ఉందని ఏసీబీ అధికారులు నాంపల్లి ఏసీబీ కోర్టుకు తెలిపారు. నిందితుడిని ఏడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. అరెస్టు సమయంలో నికేశ్‌కుమార్ విచారణకు సహకరించలేదన్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ జరిపారు. నిందితుడికి నోటీసులు జారీ చేయాలని ఏసీబీని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఏసీబీ పిటిషన్‌లో ఏముంది?

నికేశ్ అక్రమాస్తులపై 19చోట్ల జరిపిన దాడుల్లో నివ్వెరపోయే నిజాలు బయట్టపడ్డాయని ఏసీబీ అధికారులు పిటిషన్‌లో పేర్కొన్నారు. 5 భవనాలు, 6.5 ఎకరాల వ్యవసాయభూమి, 6 స్థలాలు, వాణిజ్య స్థలాలు గుర్తించామని, వాటి పూర్తి వివరాలు తెలుసుకోవాలని చెప్పారు. నికేశ్ ఆస్తులు రూ.600 కోట్లు ఉంటాయన్న సమాచారంపైనా అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.

విమానంలో ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన

- సిబ్బంది ఫిర్యాదుతో అరెస్టు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 5: ఇండిగో విమానంలో ఎయిర్‌హోస్టెస్ పట్ల ఓ ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. గురువారం బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడు ఎయిర్‌లైన్స్ సిబ్బందితోపాటు ప్రయాణికులతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రయాణికుడిని కామారెడ్డి జిల్లాకు చెందిన నర్సింహులుగా గుర్తించారు. మాల్దీవులు దేశంలో పనికి వెళ్లిన నర్సింహులు పనిముగియడంతో అక్కడి నుంచి బెంగుళూరుకు చేరుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చేందుకు విమానం ఎక్కిన నిందితుడు సిగరెట్ తాగేందుకు యత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోటి ప్రయాణికులపై చిందులు వేయడంతోపాటు ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించాడు. కేసు నమోదు చేసి నర్సింహులును అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై అప్పారావు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మ.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.
PUB/1211

టెండరు ప్రకటన

దిగువ పనుల కొరకు **26.12.2024న 15.00 గంటలు** వరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ సిగ్నల్ & టెలికాం ఇంజినీర్/నాందేడ్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, నాందేడ్ వ